అర్హులందరికీ మంజూరు చేస్తాం

● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట/జడ్చర్ల, డిసెంబర్ 13 : గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన నిరుపేదలందరికీ త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. గ్రామాల్లో ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కోసం సర్వే కొనసాగుతుందని, సర్వే పూర్తయిన వెంటనే రూ.5లక్షల చొప్పున మంజూరు చేసి ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని గంజ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాలమూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 3వ బ్రాంచ్‌ను శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాంకులో పూజలు నిర్వహించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చే ప్రజలకు మంచి సేవలు అందించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి జడ్చర్లలో 30పడకల ఈఎస్ఐ దవాఖానను ఏర్పాటు చేయించాలని శుక్రవారం జడ్చర్ల మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్‌చైర్మన్ సారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, బ్యాంక్ డైరెక్టర్ సంగమేశ్వర్, రామ్మోహన్, అశోక్‌యాదవ్, పాలమూరు బ్యాంక్ చైర్మన్ కుమారస్వామి, వైస్‌చైర్మన్లు సూర్యనారాయణ, కృష్ణ, యూనియన్ నాయకులు వెంకటేశ్, కరీం, మహేశ్, వెంకటయ్య, చంద్రమౌళి, నర్సింహులు, తాసీల్దార్ శ్రీనివాస్, డీటీ గాయత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, నాయకులు భూపాల్‌రెడ్డి, ఖాజా, సత్యం, నర్సింహ, శ్రీను, రాజశేఖర్, అమరేశ్, ఆశన్న, మైనోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

సమాజానికి జాతిరత్నాలను అందించాలి

- విద్యార్థుల బాధ్యతను ఉపాధ్యాయులే తీసుకోవాలి
- కలెక్టర్ విజయేందిరబోయి
- ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యార్థినుల ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 13 : సమాజానికి మంచి జాతిరత్నాలను అందించాలని, విద్యార్థుల బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అయోధ్యనగర్‌లో ఉన్న ఫాతిమా విద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు శుక్రవారం ముగిశాయి. ఈ ప్రదర్శనకు కలెక్టర్ విజయేందిరబోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రయోగ ప్రదర్శనలు తిలకించి వాటి ప్రాధాన్యత, ఉపయోగాలు అడిగి తెలుసుకొని అభినందించారు. విద్యార్థుల ప్రదర్శనలు అమితంగా ఆకర్షించాయని పరిసరాల్లో ఉత్పన్నమయ్యే పలు సమస్యలకు నూతన ఆవిష్కరణల ద్వారా పరిష్కారాన్ని చూపించడం ప్రశంసనీయమని కొనియాడారు. రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణ కూడా వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నిరుపేద విద్యార్థుల బాధ్యతను ఉపాధ్యాయులే తీసుకుని సమాజానికి జాతిరత్నాలను అందించాలని పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఈవో ప్రవీణ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, సైన్స్ అధికారి శ్రీనివాసులు, సీఎంవో బాలుయాదవ్, ఏఎంవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శంభుప్రసాద్ ఉన్నారు.

ప్రహరీ నిర్మించడం సరైంది కాదు

సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి నాయకులు

మహ్మదాబాద్/గండీడ్, డిసెంబర్ 13 : గండీడ్ మండల కేంద్రంలో రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాలను వేరు చేస్తూ మధ్యలో కంపౌండ్ నిర్మించడం సరైంది కాదని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఉమ్మడి గండీడ్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు కార్యాలయాల మధ్యలో కంపౌండ్‌ను నిర్మించడం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దీనికి అధికారులు ఎలా ఒప్పుకున్నారు ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టర్లకు మద్దతుగా నిలుస్తున్న అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. రెండు కార్యాలయాల మధ్యలో కంపౌండ్‌ను నిర్మించడాన్ని వెంటనే విరమించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9వ తేదీన నాటికి రైతుబంధు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఊసే లేదని విమర్శించారు. ప్రజల కోసం కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించారన్నారు. రైతు బరోసా కింద రూ.10వేల నుంచి రూ.15వేలు ఇస్తామని సంవత్సరం పూర్తి అయిన కూడా ఇవ్వలేదని విమర్శించారు. మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే పెండింగ్ బిల్లులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతి, నాయకులు గోపాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, కొండారెడ్డి, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జోగు కృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

అధ్యాపకులను సన్మానిస్తున్న ఎంఈవో

మెరుగైన విద్యను అందించాలి

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 13 : ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంఈవో కురుమూర్తి సూచించారు. అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండా ప్రాథమికొన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బాలకృష్ణయ్య, అంజద్ అలీ, బాలరాజులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు రాములు, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మిదేవి, సత్యనారాయణ, అన్వర్ హెస్సేన్, అరుణకుమారి, నర్మద, గాయత్రి పాల్గొన్నారు.

కాగితాలకే పరిమితమైన వార్డుల అభివృద్ధి

సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 13 : మహబూబ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించగా పలు వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు గోవింద్, అనంతరెడ్డి మాట్లాడుతూ మా వార్డుల్లో అభివృద్ధి పనులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని వాపోయారు. పురపాలిక కౌన్సిలర్లు అంతా సంతోషంగా ఉన్నా.. తాము సంతోషంగా లేమన్నారు. వార్డుల్లో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల తాలూకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల దిమ్మెలు దిష్టిబొమ్మలుగా మారాయన్నారు. అభివృద్ధి పనులు టెండర్లు పూర్తయ్యాక కూడా కేవలం పేపర్ మీదే ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఎద్దేవా చేశారు. కౌన్సిలర్లు కట్ట రవికిషన్‌రెడ్డి, రామాంజనేయులు, అంజయ్య, రమ్మిత, మునీరుద్దీన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు కేటాయింపు జరిగిందన్నారు. నూతన చైర్మన్ ఆనంద్‌గౌడ్ పాలనలో వేగవంతంగా అభివృద్ధి జరిగిందని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాపాలనలో మున్సిపల్ కౌన్సిల్‌లో ఇప్పటి వరకు రూ.వంద కోట్ల 79లక్షలకు పైగా రోడ్లు, మురుగునీటి కాలువలు, కమ్యూనిటీ హాల్స్, ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయించామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

● హౌసింగ్ డీఈ నాగేదర్‌గౌడ్

భూత్పూర్, డిసెంబర్ 13 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హౌసింగ్ డీఈ నాగేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో దరఖాస్తుదారుల ఇండ్లను పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తున్న చేసుకొన్న వారి వివరాల ఆధారంగా దరఖాస్తుదారుల ఆర్థిక వివరాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిజమైన అర్హులందరికీ ఇండ్లను మంజూరు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శంకర్ నాయక్, వార్డు ఆఫీసర్ సైదమ్మ, సభ్యులు విజయ్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి నిబద్ధత ఉంది

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పాలమూరు, డిసెంబర్ 13 : విద్య వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండలం ఫత్తేపూర్ క్లస్టర్ 3లో అంగన్‌వాడీ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు యూనిఫామ్స్ కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఎంపీడీవో కరుణశ్రీ, శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ సాధనకు ముందుండి ఉద్యమిస్తా

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, డిసెంబర్ 13 : మక్తల్ రెవెన్యూ డివిజన్ సాధనలో అఖిలపక్ష నాయకులతో కలిసి ముందుండి రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటం చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ రెవెన్యూ డివిజన్ సాధన కోసం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు సలీం, కిరణ్ ఆధ్వర్యం లో శుక్రవారం స్థానిక నెహ్రూగంజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మక్తల్ నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో రాజకీయంగా, ఆర్థికంగా, వ్యవసాయ వనరులు, పుష్కలంగా కలిగి ఉన్న ప్రాంతంగా మక్తల్ నియోజకవర్గానికి పేరు ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారంగా మక్తల్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, లక్ష్మిరెడ్డి, చంద్రకాంత్ గౌడ్, చిన్న హన్మంతు, రవికుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 13 : చిన్నచింతకుంట ప్రభుత్వ దవాఖానలో 108, 102 అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని చింతకుంట బీజేపీ శాఖ ఆధ్వర్యంలో దవాఖాన ఎదుట ధర్నా నిర్వహించారు. గతంలో ఎన్నో పర్యాయాలు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అధికారులు స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టిసారించి అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యాధికారి శిరీష ఉన్నతాధికారులతో మాట్లాడి అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింతకుంట పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర

శబరికి సైకిల్ యాత్రకు వెళ్తున్న స్వాములు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 13 : జిల్లాకేంద్రానికి చెందిన గౌని సుధీర్‌రెడ్డి శుక్రవారం అయ్యప్ప మాలధరించి సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరాడు. అరవిందగౌడ్, శ్రీధర్, మనోజ్, మయూరీనాథ్, మహేశ్, గిరి, కృష్ణ గురుస్వాములు సుధీర్‌ను సన్మానించారు. మొదటి రోజు హైవే-44 సమీపంలో ఉన్న బీచుపల్లి ఆంజనేయస్వామి వద్దకు చేరుకొని పూజల అనంతరం అక్కడే బసచేసి.. శనివారం తిరిగియాత్ర ప్రారంభించనున్నట్లు చెప్పారు. జనవరి 1వ తేదీ వరకు 1112 కిలోమీటర్లు యాత్ర చేపట్టి శబరిమల స్వామి సన్నిధికి చేరుకుంటానన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

దామరగిద్ద, డిసెంబర్ 13 : మండలంలోని మొగల్‌మడ్క పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్రవంతి 100 మీటర్లు, 200 మీటర్లు పరుగుపందెంలో మంచి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన స్రవంతిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీరప్ప, అంజిలప్ప, నవ్యశ్రీ భాగ్యమ్మ, మోహన్‌రెడ్డి, శశిధర్ ఉన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి

అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

నారాయణపేట, డిసెంబర్ 13 : సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం బేషరతుగా చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద చేపట్టిన ధర్నా శుక్రవారం కూడా కొనసాగింది. సమ్మెకు పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డితోపాటు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మద్దతు తెలిపారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు రాజశేఖర్, అల్తాఫ్, ఆరీఫ్, అనిత, విజయ, శాలిని తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను విజవంతంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 13 : సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని ఒలంపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో పీడీ, పీఈటీ, క్రీడా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ, మండలస్థాయిలో నిర్వహించిన సీఎంకప్ పోటీలో విజయం సాధించిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లా స్టేడియం మైదానంలో నిర్వహించే జిల్లా స్థాయిలో పోటీలో పాల్గొంటారన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ, డిసెంబర్ 13 : మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలను నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రకాశ్ ఎంఈవో గాయత్రి, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, మాజీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, స్థానిక నాయకులు మాధవరెడ్డి, రహమాన్‌ఖాన్ హెచ్ఎంలు నరసింహాచారి, రామకృష్ణ, పీఈటీ రామ్మోహన్‌గౌడ్, అనంత సేన తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలో రాణించాలి

● పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప

కేరళ వెళ్తున్న పీయూ వాలీబాల్(పురుషుల) జట్టుతో రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 13 : ఆల్ ఇండియా, సౌత్‌జోన్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయిలో పాలమూరు క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప సూచించారు. శుక్రవారం పీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో ప్రతి అంశాన్ని నిశిత పరిశీలన చేయడంతోపాటు శ్రద్ధ, ఏకాగ్రత అత్యంత ప్రధానం అన్నారు. సౌత్‌జోన్ పోటీల్లో భాగంగా కేరళ వెళ్తున్న పీయూ వాలీబాల్ పురుషుల జట్టుకు ట్రాక్ సూట్, టీమ్ యూనిఫాంలు అందజేశారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరుగుతాయని పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ టూ వీసీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, కోచ్‌లు సుచేతన్‌రెడ్డి, చిన్నవీరయ్య, మన్యం పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో సత్తాచాటాలి

అభినందిస్తున్న డైరెక్టర్ రామిరెడ్డి,ప్రిన్సిపాల్ కేపీ జోషి

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 13 : సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో సత్తాచాలని ఎస్వీఎస్ దవాఖాన డైరెక్టర్ రామిరెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ జోషి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాల లో సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్, సైన్స్ కళాశాలలో నిర్వహించిన బాలుర వాలీబాల్ టోర్నమెంట్‌లో ఎస్వీఎస్ మెడికల్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు కేరళ రాష్ట్రం అరువనంతపురంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో రాజేశ్‌నాయక్, సౌమిత్, గౌతమ్, వినయ్‌గౌడ్ పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోహిత్ దీక్షిత్, డాక్టర్ సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయాలు జరిపితే చర్యలు

నారాయణపేట, డిసెంబర్ 13 : నార్కోటిక్ డ్రగ్స్ క్రయవిక్రయాలు జరిపితే ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1905 ప్రకారం కఠిన శిక్షకు లోనవుతారని ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మక్తల్ మండలంలోని చందాపూర్ గ్రామ శివారులో ఆల్ఫాజోలం క్రయ విక్రయాలు జరుపుతున్నారనే సమాచారంతో డీటీఎఫ్ సీఐ కవిత, పేట ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్హెచ్‌వో రాజేందర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ అండ్ పేట ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 462 గ్రాములు ఆల్ఫాజోలం పట్టుకున్నారు. బోయ సత్యం, ఉసేనప్పలపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

గ్రూప్-2 కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

నారాయణపేట, డిసెంబర్ 13 : ఈనెల 15, 16 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరుగనున్న గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుందని ఎస్పీ యోగేశ్ గౌతమ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల వరకు ఐదుగురికి మించి ఉండరాదని, కేంద్రాల పరిసరాల్లో ఇంటర్‌నెట్, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలు మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజావాణి రద్దు

నారాయణపేట టౌన్, డిసెంబర్ 13 : ఈనెల 16న గ్రూప్-2 పరీక్ష జరగనున్న నేపథ్యంలో అధికారులు పరీక్ష విధులకు హాజరవుతున్న నేపథ్యంలో సోమవారం జరిగే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి ప్రజావాణికి రావద్దని కలెక్టర్ సూచించారు.

జిల్లా వాసికి స్వచ్ఛభారత్ అవార్డు

పాలమూరు, డిసెంబర్ 13 : జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్ బస్తీకి చెందిన నలిగేసి బాలానంద్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ పురపాలక సంఘంలో స్వచ్ఛభారత్ మిషన్ స్కీమ్‌లో భాగంగా టీంకో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడి మార్కెట్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో వీరి బృందం అద్భుతంగా పనిచేసిన సందర్భంగా అక్కడి కలెక్టర్ శ్రీవిక్రమాదిత్య సింగ్ మాలిక్ చేతులమీదుగా బహుమతి, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కమిటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న వాహనాల పట్టివేత

బాలానగర్ (రాజాపూర్), డిసెంబర్ 13 : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లెపల్లి శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు రెండు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. రాజాపూర్ సమీపంలోని దుందుభీ వాగులో గురువారం అర్ధరాత్రి ఇసుకను తరలించేందుకు వెళ్తున్న ఓ టిప్పరును పట్టుకున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం గుంటిపల్లికి చెందిన గడ్డం మాసన్న ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మల్లెపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ ట్రాక్టర్‌లో ఇసుకను తరలించేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

చిన్నచింతకుంట మండలంలో..

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 13 : నారాయణ పేట జిల్లా మాగనూరు మండలం నుంచి ఇసుకను తరలిస్తున్న ఐదు టిప్పర్లను శుక్రవారం చింతకుంట పోలీసులు పట్టుకున్నారు. మాగనూరు నుంచి చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి రహదారి మీదుగా ఇసుకను తరలిస్తున్న ఇసుక టిప్పర్లను చింతకుంట ఎస్సై శేఖర్ తనిఖీ నిర్వహించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.11,555 ధర పలికిన కందులు

నారాయణపేట టౌన్, డిసెంబర్ 13 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం 622 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.11,655 కనిష్ఠంగా రూ. 9,922 ధర పలికింది. 1,894 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా క